క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

నీటి పన్ను తొలగించండి



తెనాలిఅర్బన్: మంచి నీటి పన్ను ఎక్కువగా వస్తుందని, దానిని తొలగించాలని 23వ వార్డు వాసి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. కమిషనర్ బండి శేషన్న ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగు చినరావూరు పార్కుకు వెళ్తే దారిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని, రామలింగేశ్వరపేటలో వాహనాలు రోడ్డుపై పెడుతున్నారు. అవి పెట్టకుండా చూడాలని పలువురు కోరారు. పరిశీలించిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఎసీపీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారుదల జరిగే విధంగా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. 19వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించారు. కమిషనర్ స్వయంగా కాల్వల్లోని వ్యర్థాలను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కాల్వలను బాగు చేస్తే చాలా వరకు మురుగు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

వ్యర్థాలు లేకుండా చూడాలి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. చెంచుపేటలో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

విధుల నుంచి ఎమినిటీ సెక్రెటరీ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

తెనాలిఅర్బన్: తెనాలి 28వ వార్డు సచివాలయ ఎమినిటీ సెక్రెటరీ పి.నవీన్‌ను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాలు ఇచ్చారు. సాక్షి దినపత్రికలో గృహ యోగంలో అవినీతి పర్వం శీర్షికన ఈనెల 11వ తేదీన కథనం వెలువడిన విషయం తెలిసింది. దీనిపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించి వెంటనే అతడిపై కేసులు నమోదు చేయటంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై కమిషర్ నవీన్ నుంచి వివరణ కోరారు. అది సంతృప్తి కరంగా లేకపోవటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు.

యోగా పై శిక్షణ

కొల్లిపర: మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులకు మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం కొల్లిపర గ్రామంలోని హరి కల్యాణమండపం, వల్లభాపురంలో హౌటు వారి పాలెం కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ శిక్షణా కార్యక్రమానికి మండల పరిధిలోని మండల స్థాయి అధికారులు, 20 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తప్పకుండా హాజరై శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాహితీ విస్ఫోటనం

- తాత్విక కవి కేశవకుమార్
- ఆయన కవిత్వంలో ప్రతిఘటన ధ్వనులు
- రేపు తెనాలిలో కేశవకుమార్ రెండు కవితా సంపుటాలు ఆవిష్కరణ సందర్భంగా....

తెనాలి: ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ తాత్విక కవి కేశవకుమార్ రచించిన కవితలతో తీసుకొచ్చిన రెండు కవితా సంపుటాలను తెనాలిలో ఈనెల 28న ఆవిష్కరించనున్నారు. 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 5 గంటలకు స్థానిక గౌతమ్‌గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. కేశవకుమార్ రచించిన 'ఆదిమ పౌరుడు' కవితా సంపుటిని సాహితీ విమర్శకుడు బి.తిరుపతిరావు ఆవిష్కరిస్తారు. 'ఎగిరే పళ్లెం నడిచే మంచం ఓ కూనిరాగం' సంపుటిని కవి సీతారాం ఆవిష్కరిస్తారు. కత్తి కళ్యాణ్, శిఖా–ఆకాష్, నూకతోటి రవి కుమార్, చల్లపల్లి స్వరూపరాణి, పల్నాటి శ్రీరాములు, ఎన్‌జే విద్యాసాగర్, బంగారు బ్రహ్మం ప్రసంగిస్తారు.

కేశవకుమార్ సొంతూరు తెనాలి సమీపంలోని అమృతలూరు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉంది. తల్లిదండ్రులు నాగేంద్రమ్మ, దేవానంద్, స్కూల్ హెచ్‌ఎంగా చేసిన నాగేంద్రమ్మ పిల్లల్ని ఉన్నతుల్ని చేశారు. గ్రామంలోని హైస్కూల్ తర్వాత తెనాలిలో ఇంటర్ చదివిన కేశవకుమార్, ఆంధ్రా లయోలా కాలేజీలో బీఎస్సీ చదివారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో ఏం.ఏ,'జిడ్డు కృష్ణమూర్తి 'ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ ట్రెడిషన్ అండ్ రెవల్యూషన్'పై పీహెచ్‌డీ చేశారు.' పొలిటికల్ ఫిలాసఫీ ఆఫ్ అంబేద్కర్ 'ఎన్ ఎంక్వైరీ ఇంటూ ది థియరేటికల్ ఫౌండేషన్స్ అఫ్ ది దళిత మూవ్మెంట్' అనే అంశంపై పోస్ట్ డాక్టరేట్ డిగ్రీ చేశారు. ఆయా సిద్ధాంత గ్రంథాలను ప్రచురించారు.



పెరికల కేశవకుమార్

విద్యానంతరం ఇగ్నో భువనేశ్వర్ రీజినల్ సెంటర్‌లో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టరుగా, పాండిచ్చేరి యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశారు. పదేళ్లుగా ఢిల్లీ యూనివర్శిటీలో తత్వశాస్త్ర ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. తత్వశాస్త్ర విభాగాధ్యక్షుడిగానూ వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పరిశోధనా పత్రాలు సమర్పించారు. దళిత ఉద్యమం, తెలుగు సమాజంలోని ప్రత్యామ్నాయ ఉద్యమాలు, సంస్కృతిపై విలువైన వ్యాసాలను ఆంగ్లంలో ఇంగ్లిష్‌లో రచించారు. ప్రముఖ తత్వవేత్తల తత్వంపై అధ్యయనం చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 'క్రిటికల్ ఫిలసాఫికల్ ట్రెడిషన్స్ ఆఫ్ ఇండియా', 'ఫిలాసఫీ ఆఫ్ అంబేద్కర్', 'ఇండియన్ పొలిటికల్ ఫిలాసఫీ', క్రిటికల్ రీడింగ్ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ, 'అడ్వాన్స్‌డ్ స్టడీ అఫ్ లోకాయత ', 'బయో పాలిటిక్స్'వంటి ప్రత్యేకకోర్సులను అధ్యయన అంశాలుగా బోధిస్తున్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ రోజుల్లో 'విస్ఫోటన' సాహిత్య సంస్థని ఏర్పాటుతో సాహిత్య చర్చలు జరుపుతూ, 'సునీత పొద్దునే పోస్టరై పలకరిస్తుంది', ' దళిత మేనిఫెస్టో' అనే కవితా సంకలనాలను యూనివర్సిటీ సాహితీ మిత్రులతో కలిసి తీసుకొచ్చారు. 'బహుజన కెరటాలు' పత్రికకు ప్రధాన సంపాదకులుగానూ చేశారు. దళిత ఉద్యమం, సాహిత్యంపై విలువైన వ్యాసాలు రాశారు. కలేకూరి ప్రసాద్, కె.జి.సత్యమూర్తి, బొజ్జా తారకం, గద్దర్ పైన రోహిత్ ఉద్యమం పైన వచ్చిన ప్రత్యేక స్మారక సంచికలకు సంపాదకీయాలు రాశారు.' దళిత ఉద్యమం వెలుగు నీడలు' వ్యాస సంకలనాన్ని ప్రచురించారు. అమానవీయ ఆధిపత్య సామాజిక రాజకీయ వ్యవస్థల్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య సమాజాన్ని ఆకాంక్షిస్తూ కవితలు రాస్తూవచ్చారు. అంబేద్కరీయ ఆలోచనా వెలుగులో అసమాన కుల సమాజం, దాని దోపిడీ రూపాలుపై ఎక్కడైనా వ్యవస్థీకృతంగా సాగుతున్న కులాధిపత్యంపై దళిత స్పృహతో కవిత్వం రాశారు.

'ఎగిరే పళ్లెం, నడిచే మంచం, ఓ కూనిరాగం' కవితా సంపుటి, 'ఆదిమ పౌరుడి'కి కొనసాగింపు. అమానవీయ కులవ్యవస్థ, మానవ సమాజాన్నే మింగేస్తున్న అధునాతన టెక్నాలజీ, మార్కెట్ శక్తుల కనుసన్నల్లో నడుస్తున్న ప్రభుత్వాలు, బతుకుదెరువు కష్టమై నిత్య ఆందోళనలో బతికీడుస్తున్న సామాన్య ప్రజానీకం, మసకబరుతున్న ప్రజాస్వామ్యం... వంటి అంశాలతో రాసిన కవితలను ఇందులో చేర్చారు. 'నా ఈ కవిత్వంలో అనేక రూపాల్లో సాగే కులహింసమీద, కులాధిపత్యాన్ని ప్రతిఘటించే చైతన్యంతో, ముఖ్యంగా అంబేద్కర్ తాత్విక స్ఫూర్తి అంతర్లీనంగా వుంది' అంటారు కేశవకుమార్. ప్రపంచీకరణ నేపథ్యంలో, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మనల్ని సెల్‌ఫోన్లుగా, డిజిటల్ బానిసలుగా, శక్తిహీనులుగా, ఆలోచనా సామర్థ్యాన్ని కోల్పోయిన వాళ్ళనుగాను చేసిన హైపర్ రియాలిటీపై, వర్చువల్ హింస మీద ,పోస్ట్ హ్యూమన్ సమాజం మీద కేశవకుమార్ కవితాగ్రహమే ఈ కవితా సంపుటిలు.

వెలుగులోకి 'ఆదిమ పౌరుడు' సంపుటి



సెంట్రల్ యూనివర్సిటీ రోజుల నుంచి కోవిడ్ మహమ్మారి వరకు రాసిన కవితలతో 'ఆదిమ పౌరుడు' సంపుటిని తీసుకొచ్చారు. యూనివర్సిటీలో ప్రేమ పేరుతో మోసపోయిన దళిత స్త్రీ సునీత ఆత్మహత్య, దళిత విద్యార్థుల తొలగింపు, అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూల్చివేత, శ్రీలంక తమిళ జాతి పోరాటం, ఇరాక్‌పై అమెరికా యుద్ధం వంటి అంతర్జాతీయ ఘటనలపైనా రాసిన కవితలున్నాయి. 'కోవిడ్' టైములో రాజధానిలో రైతుల వీరోచిత పోరాటాలు, మైనారిటీ సామాజిక అస్తిత్వాన్ని కాపాడుకునే దిశలో షహీన్ బాగ్ ముస్లిం స్త్రీల ఉద్యమం, ఆ కోవలోని 'హత్రస్' ఘటన, జైలులోనే ప్రాణాలర్పించిన క్రైస్తవ ఫాదర్ స్టాన్ స్వామి... వంటి తనను కదిలించిన వాటిపై రాసిన కవితలు ఈ సంపుటిలో ఉన్నాయని కేశవకుమార్ చెప్పారు.

సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె: సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తన భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతూ చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లికి చెందిన దాసరి రాజారావు ఒక అర్జీ, తన పొలం నుంచి వర్షపు నీరు బయటకు పోయే మార్గం మూసుకుపోయిందని డొంక మార్గంలో వేసిన గ్రావెల్ రోడ్డును తొలగించాలని పెసర్లంకకు చెందిన ఎర్రం సురేష్, తన పొలాన్ని సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పెద్దపులివర్రుకు చెందిన నిమ్మగడ్డ అన్నమ్మ, కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన నూతక్కి అనసూయమ్మ, కనగాలకు చెందిన కుంచాల నాగమల్లేశ్వరి అర్జీలు ఇచ్చారన్నారు. తల్లి మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కోరుతూ ఉప్పుడికి చెందిన కొండముది శ్రావణి, తన పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని చుండూరుకు చెందిన బెల్లం వెంకట సుబ్బారావు, కారుమూరుకు చెందిన వీరంకి వీరయ్య అర్జీలు ఇచ్చారన్నారు. ఇంటి ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలని కోరుతూ వేమూరుకు చెందిన గరిక తిరుపతమ్మ, తనకు మంజూరు చేసిన నివేసన స్థలంకు హద్దులు చూపించాలని చట్రగడ్డకు చెందిన పిచ్చమ్మ అర్జీ ఇచ్చిందన్నారు. రీ సర్వేలో తన భూమి తక్కువ చూపిస్తుందని మరలా సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని అరవపల్లికి చెందిన పరుచూరి వెంకట బుచ్చయ్య చౌదరి అర్జీ ఇచ్చారన్నారు. నగరం మండల అలపర్రులో ఉన్న తమ భూమి కోర్టు పరిధిలో ఉన్నందున ఎవరికి ఆన్‌లైన్ చేయరాదని నల్లూరిపాలెంకు చెందిన అమిరినేని వెంకటేశ్వరరావు, పొలం ఆన్‌లైన్ సమస్యపై నల్లూరు నుంచి తొటెంపూడి బుచ్చిరామకృష్ణ అర్జీ అందించారన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

కుట్ర పూరిత చర్యలను ఐక్యంగా ఎదుర్కొందాం

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని మాయమాటలు చెబుతూ ప్రైవేటీకరణ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన పెద్దఎత్తున సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 4,000 మంది కాంట్రాక్టర్ కార్మికులను విధుల నుంచి తొలగించి, మరో 2,500 మందిని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. 1,200 మంది పర్మనెంట్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకు వస్తున్నాయని తెలిపారు. మోసపూరిత చర్యలను తక్షణమే ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల తొలగింపునకు నోటీసుల జారీ అమానుషం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బేతపూడి గ్రామస్తులు

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: బేతపూడి గ్రామంలో రహదారి పక్కన సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగిస్తామంటూ అధికారులు పదే పదే నోటీసులు ఇవ్వటం అమానుషమని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పేదల గృహాలను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బాధితులు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతో ఎవరికీ అడ్డులేని పేదల గృహాల తొలగింపుకు పూనుకోవటం కుట్రేనన్నారు. కూలీ పనులు చేసుకుని జీవించే నిరుపేదలపై రాజకీయం చూపించటం తగదన్నారు. రహదారి పక్కన ఉన్న ఆ పూరిళ్ల వల్ల ఎవరికీ నష్టం లేదని గ్రామస్తులు చెబుతున్నప్పటికీ గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. అధికారులు తరచూ నోటీసులు ఇవ్వటంతో తమ పూరిళ్లు ఎక్కడ కూలదోస్తారోనన్న భయంతో ఆ నిరుపేదలు గత పది రోజుల నుంచి పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారన్నారు. అధికారులు రాజకీయాలను పక్కనపెట్టి మానవతా దృక్పథంతో పేదల ఇళ్లను కూలగొట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిస్థితులను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, సీఐ మల్లికార్జునరావులకు వివరించారు. కార్యక్రమంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ, సీపీఎం, జై భీమ్ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యను విన్నవిస్తున్న సీపీఎం, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు

శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని వినతి

రేపల్లె: రేపల్లె డివిజన్ పరిధిలో శ్మశాన వాటికలు లేని ఎస్సీ పల్లెలకు స్థలాలు కేటాయించాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ కోరారు. శ్మశాన వాటిక స్థలాల విషయమై సోమవారం ఆర్డీవో రామలక్ష్మికి ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన నేటికి అనేక పల్లెల్లో శ్మశాన వాటికలు లేక పొలం గట్లు, రహదారులు వెంట దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితులు ఉండటం శోచనీయమన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.వేల కోట్లను కేటాయింపు చేస్తున్నట్లు పాలక ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో శూన్యంగా కనిపిస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి వెంటనే స్థలాలను కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరావునాయుడు, కర్రా బాబు రావు, శ్యామ్ పాల్గొన్నారు.

సమంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు

చుండూరు(వేమూరు): సమంత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపకులు తెనాలి సందీప్ అన్నారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో సోమవారం సమంత చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చావలి నజేష్, కసుకుర్తి వెంకటేశ్వర్లు, దావులూరు యశ్వంత్, పెరవలి మోహన్ బాబు, కె.రాజశేఖర్ తదిరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో ముగ్గురికి ఉద్యోగాలు

లక్ష్మీపురం: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకంలో భాగంగా కొటికల సాల్మన్ రాజు, రుంజల రవిసాగర్, పద్మ సాయి నిఖిలకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజలను వ్యవసాయ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నిబంధనల మేరకు డ్యూటీకి రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి , డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటు భయంతో యువకుడి ఆత్మహత్య

లక్ష్మీపురం: గుండెపోటు వస్తుందనే భయంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌కు చెందిన గరికపాటి శివరామకృష్ణ (36) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 24న గుండెపోటు వస్తుందనే భయంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసాయన రహిత సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

చుండూరు(వేమూరు): రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.శిరీష తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో రసాయన రహిత సేంద్రియ వ్యవసాయంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు ప్రణాళికాబద్ధంగా గ్రామంలో ఉన్న వనరులను వినియోగించుకుంటూ పంటలను సాగు చేసుకోవాలన్నారు.

ఆధార్ సీడింగ్ (ఎన్‌పీసీఐ మ్యాపింగ్) చేయించుకోండి

తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు



తెనాలిఅర్బన్: సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌ను చేయించుకోవాల్సిన అవసరం అందరికీ ఉందని తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు సోమ వారం తెలిపారు. రాష్ట్రంలో 51 లక్షల మంది ఇంకా బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్ కార్డుకు అనుసంధానం చేయించుకోలేదని తెలిపారు. గతేడాది జీఎస్‌డబ్ల్యూస్, పోస్టల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఆధార్ సీడింగ్ చేయటం జరిగిందని గుర్తుచేశారు. జూన్ 5వ తేదీ నుంచి పోస్టల్ శాఖ, సచివాలయ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో ఆధార్ సీడింగ్‌ను తెనాలి డివిజన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు



ఉత్సవ పూజల్లో భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు, శ్రీమన్యసూక్త హోమాన్ని ఆలయ వంశ పారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితుడు నాగమారుతి బృందం ఆగమోక్తంగా నిర్వహించింది. సాయంత్రం 1108 లడ్డూలతో విశేష పూజాది కార్యక్రమాలు చేశారు. 108 మంది భక్తులు 108 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని, భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్ కుమార్, సురేష్, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

మంగళగిరి టౌన్: మనిషి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో సోమవారం ఉచిత యోగ శిక్షణా తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నెల రోజుల ముందు నుంచి యోగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న యోగా తరగతులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరి దివ్యకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు జైలు శిక్ష

కొల్లిపర: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం కుంచవరంకు చెందిన వెలివెల కోటేశ్వరావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలబెట్టి ఇంట్లోకి వెళ్లి ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. దీంతో వాహనం చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో కొల్లిపరకు చెందిన కేశన గంగాధర్ రావు తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో అమిరే ఆనంద్ కిషోర్, పిల్లి శ్రీను నిందితులుగా నిర్ధారించి అరెస్ట్ చేసి మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకుని కోర్టులు చార్జిషీటు దాఖలు చేశారు.

కేసు విచారణలో సదరు ఇద్దరు ముద్దాయిలపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ పి.రాజశేఖర్ తీర్పు వెలువరించారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

నల్లబర్లి పొగాకును కొనుగోలు చేయాలి



కాకుమాను: నల్లబర్లి పొగాకును ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం పార్టీ సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి రైతులు నల్లబర్లి సాగు చేశారని అన్నారు. గత మూడేళ్లుగా అధిక దిగుబడి, మంచి ధర ఉండడంతో ఈ ఏడాది కూడా కౌలు రైతులు అధిక మొత్తంలో నల్లబర్లి సాగు చేశారని అన్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర లేకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే బర్లి పొగాకుకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్, ముద్దన వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, మర్రి లక్ష్మీ, భువనేశ్వరి, నల్లమోతు రాజేంద్ర, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: ప్రభుత్వం వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం మంగళగిరి మండలం చిన్నకాకానిలోని ఎన్నారై సమీపంలో గల భూములను జంగాల పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు పాస్ చేసిన తర్వాత ఎన్నారై సమీపంలో గల 75 ఎకరాల వక్ఫ్ భూమిని చేజిక్కించుకోవాలని చూస్తోందని విమర్శించారు. వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ తరతరాల నుంచి ఆ భూములు రైతులకు జీవనాధారంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతులు బొర్రా నాగేశ్వరరావు, రామినేని చంద్రమోహన్, సుంకర సుబ్బారావు, మర్రి మోహనరావు, సుంకర శంకరరావు, పాలడుగు రవికుమార్ పాల్గొన్నారు.

తెనాలి పోలీసులను సస్పెండ్ చేయాలి

లక్ష్మీపురం: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డ తెనాలి పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేట జిల్లా సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. తెనాలి పట్టణంలో ముగ్గురు వ్యక్తులు చేసిన నేరం నిరూపణ అయిందో లేదో కానీ పోలీసులు చేసింది మాత్రం కచ్చితంగా నేరమేనని తెలిపారు. ఎవరైనా నేరం చేస్తే విచారణ చేపట్టి శిక్ష వేసే అధికారం న్యాయస్థానాలకు మాత్రమే ఉందని, పోలీసులకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటనపై కోర్టు సుమోటోగా తీసుకుని ముగ్గురు యువకులను విచక్షణారహితంగా కొట్టిన ఘటన ప్రదేశంలో ఉన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.